డిజైర్ డిజైనర్ ఎగ్జిబిషన్ షురూ

మాదాపూర్: డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని ఎన్‌కన్వెన్షన్‌లో శుక్రవారం డిజైర్ డిజైనర్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వాహకురాలు అనితా అగర్వాల్ మోడల్స్ ఇషిక, కుసుమలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరవాసులను ఆకట్టుకునే విధంగా వివిధ రాష్ట్రాలకు చెందిన సాంప్రదాయ దుస్తులతో పాటు నగర యువతను ఆకట్టుకునే వస్త్రాభరణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మూడురోజుల పాటు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని తెలిపారు.

నేడు అనఘావ్రతం

సనత్‌నగర్: పుష్య మాసం బహుళ అష్టమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలో శ్రీదత్తాత్రేయ స్వామి వారి దేవాలయంలో శనివారం (నేడు) ఉదయం 9.30 గంటలకు అనఘావ్రతం జరుగుతుందని ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలన్నారు.

ప్రొ.శ్రీరామ్ వెంకటేష్‌కు జాతీయ అవార్డు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్, రాష్ట్ర ఉన్నత విద్య మండలి కార్యదర్శి ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ జాతీయ అవార్డు అందుకున్నారు. శుక్రవారం కన్యాకుమారిలో జరిగిన ఇస్రో కార్యక్రమంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ సిస్టమ్స్ ఫర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఐఎస్ఎస్ఈ) ఫెలోషిప్ మెంబర్– 2023 అవార్డును చైర్మన్ సోమనాథ్, మాజీ చైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. ఇంజినీరింగ్ కాలేజీలో సంకలిత, త్రీడి ప్రింటింగ్‌ల తయారీ ఏర్పాటు, పరిశోధనల్లో ఆయన చేసిన సేవలకు అవార్డును అందచేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఆ ప్రహరీ దగ్గరే పాట్లు

ట్రాఫిక్ జామ్‌లకు కేరాఫ్ పీజేఆర్ స్టేడియం రోడ్డు

హఫీజ్‌పేట్ : పీజేఆర్ స్టేడియం నుంచి లింగంపల్లి రైల్వే బ్రిడ్జి వెళ్లే రహదారి ఇరుకుగా ఉండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం గచ్చిబౌలి, నానకరాంగూడ వైపు వెళ్లే ఐటీ ఉద్యోగులు ప్రధానంగా చందానగర్, గంగారం, మదీనాగూడలకు చెందిన వాహనదారులు పీజేఆర్ స్టేడియం నుంచి శివాజీనగర్ మీదుగా లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వెళతారు. కానీ పీజేఆర్ స్టేడియం వద్దకు రాగానే అక్కడ ప్రహరీ గోడ ఉండడంతో ఒకసారి ఒక వాహనం వెళ్లేందుకే అవకాశం ఉంటుంది. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో లింగంపల్లి అండర్ బ్రిడ్జి నుంచి పీజేఆర్ స్టేడియం వరకు ట్రాఫిక్‌తో నరక యాతన కనబడుతుందని వాహనదారులు వాపోతున్నారు.



చందానగర్ పీజేఆర్ స్టేడియం వద్ద ఇరుకుగా మారిన రోడ్డు

- పీజేఆర్ స్టేడియం నుంచి లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు వెంటనే రోడ్డు విస్తరణ చేపట్టాలి.
- పీజేఆర్ స్టేడియం ప్రహరీ కొంత మేర జరిపితే రోడ్డు విస్తరణకు అనుకూలంగా ఉంటుంది.
- రోడ్డు చిన్నదిగా మారడంతో నిత్యం వాహనదారులు ప్రమాదాలకు సైతం గురవుతున్నారు.
- రోడ్డుపై గుంతలతో ద్విచక్ర వాహనదారులు సతమతమవుతున్నారు.
- భారీ వాహనాలు రాకుండా కమాన్ ఏర్పాటు చేసినా, ప్రమాదకరమని తొలగించారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది.

జీహెచ్‌ఎంసీ అధికారులకు వినతిపత్రాలు అందించా



చందానగర్ పీజేఆర్ స్టేడియం ప్రహరీ 5 అడుగుల మేర జరిపితే రోడ్డు విస్తరణకు అనుకూలంగా ఉంటుంది. వాహన రాకపోకలకు ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వ స్థలం కాబట్టి ప్రహరీని కుదిస్తే ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టవచ్చు. గతంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, చందానగర్ ఉప కమిషనర్‌లకు వినతిపత్రాలు అందించా. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు.

– తాడిబోయిన రామస్వామి యాదవ్, మాజీ కౌన్సిలర్

ఇరుకు రోడ్డుతో ఇబ్బంది



చందానగర్ నుంచి గచ్చిబౌలికి వెళ్లే క్రమంలో పీజేఆర్ స్టేడియం వద్దకు రాగానే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాం. ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ తీవ్రంగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డు విస్తరణ చేయాలి.

– శేఖర్, వాహనదారుడు





పీజేఆర్ స్టేడియం వద్ద వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిపడుతున్న దృశ్యాలు



చందానగర్ పీజేఆర్ స్టేడియం నుంచి శివాజీనగర్ వద్ద ఇరుకు రోడ్డు

నేడు బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం

- కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ కోఆర్డినేటర్ సతీష్ అరోరా
- హాజరుకానున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కూకట్‌పల్లి విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం శనివారం ఉదయం 10గంటలకు కూకట్‌పల్లిలోని ఎస్‌కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో జరగనున్నట్లు కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా తెలిపారు. అభివృద్ధి ప్రధాత కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మాజీమంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా విచ్చేయుచున్నారని తెలిపారు. ఈ సమావేశంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల గురించి కార్యకర్తలను సన్నద్ధం చేసేందుకు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశానికి కార్పొరేటర్లు, నియోజకవర్గం నాయకులు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, అనుబంధ అధ్యక్ష, కార్యదర్శులు, బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: కుందన్‌బాగ్, ఐడీపీఎల్, గ్రీన్‌ల్యాండ్స్ ఆల్విన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బీఎస్ మక్తా, హస్సేన్‌నగర్, నిషాంత్‌బాగ్ కాలనీ, హనుమాన్ టెంపుల్, సుభానీ మసీద్ ఏరియా, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, శాంతి శిఖర అపార్ట్‌మెంట్స్, అయ్యప్ప టెంపుల్ లేన్, చర్చిగల్లీ, టీవీఎస్ షోరూమ్ లేన్, స్వాతి టిఫిన్స్ వెనుక కాలనీ. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు హెచ్‌పీరోడ్డు, లక్ష్మీకళ థియేటర్ ఏరియా, శ్రీరాములు థియేటర్ ఏరియా, అశ్వని హెయిర్ ఆయిల్ లేన్, రాధాసూపర్ మార్కెట్, మెరిడియన్ ప్లాజా, నీరజ్ పబ్లిక్ స్కూల్ లేన్, ఆర్‌బీఐ క్వార్టర్స్, స్వప్న నర్సింగ్ హోం, నిషాంత్‌బాగ్, కీర్తిలాల్ జ్యువెలర్స్, బాబుఖాన్ మాల్, అమృత మాల్, మూసాపేట మెయిన్‌రోడ్డు, జెక్ కాలనీ ఇంద్రప్రస్థ బిల్డింగ్, బేగంపేట ఉమానగర్, వామన్ నాయక్ లేన్, చిన్మయ స్కూల్, ట్రాన్సిస్ట్ హాస్టల్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

నేడు గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్

శ్రీనగర్‌కాలనీ: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారి కోసం శనివారం బంజారాహిల్స్‌లోని తాజ్‌డెక్కన్‌లో ఐవీవై ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్–2024ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతర్జాతీయంగా ప్రసిద్ధిగాంచిన యూనివర్సిటీల ప్రతినిధులు హాజరై ఆయా యూనివర్సిటీల వివరాలను వెల్లడిస్తారన్నారు. ఔత్సాహిక విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలనుకుంటే, ఉచితంగా రిజిస్ట్రేషన్ నిమిత్తం ఫోన్స్: 70557 27272, 91054 91054లలో సంప్రదించాలన్నారు.

జాతీయ స్థాయిలో కులగణనను చేపట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ: జాతీయ స్థాయిలో కులగణనను చేపట్టాలని ఓబీసీ హక్కుల పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కులగణన చేపడుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఓయూలో పీహెచ్‌డీ చేస్తున్న ఓబీసీ విద్యార్థులకు ప్రతి నెల ఫెలోషిప్‌లను రూ.10 వేల వరకు పెంచాలని అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం (ఏఐఓబీసీఎస్) జాతీయ అధ్యక్షులు జి.కిరణ్‌కుమార్ కేంద్రాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌తో పాటు ఏఐఎస్ఎఫ్ నాయకులు నెల్లి సత్య, లెనిన్, దివ్య రాయ్, ఎస్ఎఫ్ఐ నేత రవినాయక్, ఆంజనేయులు, ఎన్ఎస్‌యూఐ నేత వికాస్‌యాదవ్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 21, నల్లవంకాయ 13, పొడుగు వంకాయ 13, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జిమిర్చి 28, క్యాప్సికం 55, పచ్చి కాకరకాయ 45, పందిరిబీర 40, క్యాబేజీ 21, క్యారెట్ 19, దొండకాయ 35, గుండు బీన్స్ 35, గింజచిక్కుడు 35, గోకరకాయ 50, కీర 18, దోసకాయ 19, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 18, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 55, గుమ్మడికాయ 13, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–6, ఉల్లిపొరక 35 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఎంపీ టికెట్‌కు దయాకర్ గౌడ్ దరఖాస్తు

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ భువనగిరి ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్నట్లు ఓయూ విద్యార్థి నేతల టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్ శుక్రవారం పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించానన్నారు. తాను ఉద్యోగాల భర్తీ కోసం ఎన్నో ఆందోళనలు చేపట్టినట్లు తెలిపారు. భువనగిరి నియోజకవర్గంలో గౌడ సామాజికవర్గం ఓట్లు అధికంగా ఉన్నందున ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు.

నిరుపేదల సంక్షేమానికి కృషి

సనత్‌నగర్: నిరుపేదల సంక్షేమానికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్‌కు చెందిన జువెరియా ఫాతిమాకు చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ. లక్షకు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాలను శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. అదే విధంగా రాంగోపాల్‌పేట డివిజన్‌కు నల్లగుట్ట చుట్టలబస్తీకి చెందిన మహేష్ వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.1.50 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. నిరుపేదలకు అండగా ఉంటూ వారి సమస్యలను గుర్తిస్తూ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఉత్సాహంగా సాగుతున్న కబడ్డీ పోటీలు

నిజాంపేట్: జాతీయ 49వ జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్–2024 కబడ్డీ పోటీలు శుక్రవారం బాచుపల్లిలోని కాసాని కృష్ణ ముదిరాజ్ జె.ఎస్ గెహ్లాట్ కబడ్డీ అకాడమీలో 2వరోజు జోరుగా కొనసాగాయి. ఈ సందర్భంగా లీగ్ దశలో బాలికల విభాగంలో పంజాబ్ విదర్భల, ఛత్తీస్‌ఘడ్ జార్ఖండ్, రాజస్థాన్ ఒరిస్సా, పాండిచ్చేరి జమ్ముకాశ్మీర్, మధ్యప్రదేశ్, కేరళ, ఉత్తరాంచల్, తమిళనాడు జట్లు పోటీపడ్డాయి. బాలుర విభాగంలో హిమాచల్‌ప్రదేశ్ – విదర్భ, పంజాబ్ – ఉత్తరాంచల్, ఢిల్లీ– ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ – మణిపూర్, తమిళనాడు – ఒరిస్సా, గోవా – గుజరాత్ జట్ల మధ్య పోటీలు జరిగాయి. లీగ్ దశలో విజేతలైన జట్లతో పాటు ఓడిన జట్లకు సైతం నగదు రివార్డులు అందజేశారు. ఈ పోటీలను తెలంగాణ కబడ్డీ అసోషియేషన్ కాసాని జ్ఞానేశ్వర్, ఏకేఎఫ్ఐ ఉపాధ్యక్షులు కాసాని వీరేష్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కాసాని సుధాకర్, కాసాని శిరీష, కోఆప్షన్ సలీమ్, చంద్రగిరి సతీష్, దూసకంటి వెంకటేశ్, రాము చంద్రహాస్, లీగ్‌దశలో విజేతలైన జట్లకు నగదు బహుమతులు ప్రదానం చేశారు.



గణితంపై ఆసక్తి పెరిగేలా బోధించాలి

గణిత ఉపాధ్యాయుల ఓరియంటేషన్‌లో డీఈఓ విజయకుమారి



కూకట్‌పల్లి: మేడ్చల్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి పీఎస్ఎం పాఠశాలలోని వివేకానంద సేవా సమితి ఆడిటోరియంలో శుక్రవారం జిల్లా పదో తరగతి బోధించే ప్రభుత్వ పాఠశాలల గణిత ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా విద్యార్థులు జాగ్రత్త సమయాన్ని వాడుకోవాలి. క్లిష్టంగా భావించే గణితం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులకు ఉన్న భయాన్ని పోగొట్టి గణితం పట్ల ఆసక్తి పెంచేలా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం గణిత స్టేట్ రిసోర్స్ పర్సన్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు గణితంలో విద్యార్థులను ఎలా సన్నద్ధం చేయాలనే అంశంపై ఓరియంటేషన్ ఇచ్చారు. అదే విధంగా తెలుగు స్టేట్ రిసోర్స్ పర్సన్‌భాను ప్రకాష్ తెలుగు భాషోపాధ్యాయులకు ఓరియంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగం సెక్రటరీ సురేష్, ఎంఈఓ ఆంజనేయులు, ఏఎంఓ రవీందర్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పీఎస్ఎం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ విజయకుమారి

బోరబండ రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తా

బొంత హరికృష్ణ



మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి బొంత హరికృష్ణను బోరబండ రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ మెంబర్‌గా సికింద్రాబాద్, సౌత్ సెంట్రల్ రైల్వే అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ఐఎస్ఆర్ మూర్తి నియమించారు. ఈ పదవిలో కొనసాగితనంత కాలం అల్లాపూర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి కార్యక్రమాలు హరికృష్ణ పర్యవేక్షణలో జరుగుతాయని సూచించారు. ఈ అవకాశం కల్పించినందుకు సికింద్రాబాద్ డివిజన్ మేనేజర్ ఐఎస్ఆర్ మూర్తికి ధన్యవాదాలు తెలిపారు. తన పదవీ కాలంలో ఎటువంటి అవినీతి జరగకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తానని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మోతీనగర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని న్యూ రామారావు నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె. రామ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అల్లాపూర్ డివిజన్ న్యూ రామారావు నగర్ కమ్యూనిటీహాల్‌లో ఏఐజీ గ్రీ ప్యాక్, ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ, న్యూ రామారావు నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మౌనిక రెడ్డి, డాక్టర్ బసవయ్య పర్యవేక్షణలో సుమారు 200 మంది వైద్య సేవలు పొందారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో మధుమేహం, బీపీ, నేత్ర, దంత, చర్మ, కాళ్లు, కీళ్లు, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ సిబ్బంది నాయుడు, ఏవి శ్రీనివాస్, అఖిల్ స్థానిక నాయకులు పి. శివాజీ, ఎస్ఆర్ అమరేందర్, ఎస్. సాయిరెడ్డి, బి. శ్రీనివాస్, సిఎస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభలతీర్థం వేడుకలు షురూ..

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని అపర్ణ సరోవర్‌లో ప్రభల తీర్థం వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు ఉదయం కట్టెల పొయ్యిపై మట్టికుండలలో పాయసం తయారీని ఆనందోత్సాహాలతో చేసుకున్నారు. వేడుకల్లో భాగంగా పాత పల్లె ఆటలలో సంతోషంగా పాల్గొనడం, వివిధ రకాల వంటలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చందన మాట్లాడుతూ ప్రభల తీర్థం వేడుకలను అపర్ణ సరోవర్‌లో 2016 నుంచి నిర్వహిస్తున్నామని ఈశ్వరుడి ఆరాధనలో సరోవర్‌వాసులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని అన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మియాపూర్: మియాపూర్‌లోని ఎంఏనగర్ కాలనీ, ప్రశాంత్‌నగర్ కాలనీలో 100,101 సర్వేనంబర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను హెచ్‌ఎండీఏ హుడా, రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. హుడా, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా మియాపూర్, హుడా పోలీసుల బందోబస్తు మధ్య ఐదు నిర్మాణాల గోడలను జేసీబీతో కూల్చివేశారు. హుడా అసిస్టెంట్ ఎస్టేట్ అధికారి గౌతం, హుడా ఎస్ఐ సంతోష్‌రెడ్డి,ఆర్ఐ శ్రీను పర్యవేక్షణలో 50 మంది పోలీసులు పహారాలో కూల్చివేతలు నిర్వహించారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ వద్ద రూ.90లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులను శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల సమస్య నేటితో తీరిందన్నారు. నాలా మీద కల్వర్టు నిర్మాణ పనులతో ఇక్కడి ప్రాంత ప్రజలకు, కాలనీ వాసులకు ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. ప్రయాణ దూరం తగ్గి, ఇంధనం కూడా ఆదా అవుతుందని తెలిపారు. కల్వర్టు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కల్వర్టు పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడొద్దన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఏఈ ఆశావర్కు ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, మాజీ కార్పొరేటర్ రంగారావు, వివేకానందనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు రమణారెడ్డి, శ్రీనివాస్, మోజెస్, వెంకట్‌రెడ్డి, చంద్రమోహన్ సాగర్, జగదీష్ పాల్గొన్నారు.



కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్

నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎన్‌టీఆర్ నగర్ నుంచి పీజేఆర్ నగర్‌కు వెళ్లే సీసీ రోడ్డుకు రూ.50 లక్షల నిధులు మంజూరై, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులైన సీసీ రోడ్డు పనులను శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేషగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా సీసీ రోడ్డు నిర్మాణ సమయంలో లెవెలింగ్ చూసుకొని ప్రణాళికాబద్ధంగా వర్షపు నీరు నిల్వకుండా వెళ్లిపోయేలా చేపట్టాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్. భాస్కర్, ఖాజా, వెంకటేష్‌గౌడ్, ఇంతియాజ్, పోశెట్టి గౌడ్, మహేష్, కటిక రవి, మహబూబ్, సాయిగౌడ్, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్‌నగర్ నుంచి పీజేఆర్‌నగర్‌కు సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

4 నుంచి 'దస్తకారీ హాత్ సమితి' ఎగ్జిబిషన్

వేదిక కానున్న గచ్చిబౌలి 'నిథమ్'

రాయదుర్గం: హైదరాబాద్ నగరంలో 'దస్తకారీ హాత్ సమితి' ఆధ్వర్యంలో రెండవ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నిర్వహణకు గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) వేదిక కానుంది. 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుంది. దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు లభిస్తాయి. నిత్యం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ఈ ఎగ్జిబిషన్‌లో భాగంగా ప్రత్యేక వర్క్‌షాప్‌లు .. 5వ తేదీ మధుబని పెయింటింగ్, బిహార్..6వ తేదీ గోండ్–మధ్యప్రదేశ్, 7వ తేదీ పట్టచిత్ర –ఒడిశా, 8వ తేదీ క్లేవర్క్–న్యూఢిల్లీ, 9వ తేదీ టెర్రకోట ,న్యూఢిల్లీ వారి వర్క్‌షాపులు జరుగుతాయి.



పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు

మియాపూర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అసంపూర్తిగా మిగిలిపోయిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులకు సూచించారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, కార్పొరేటర్లతో కలిసి పెండింగ్ పనులు, పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకుస్థాపన చేసిన పనులను ప్రారంభించి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లు, నాలా, వరదనీటి కాల్వ పనులు, పార్క్ అభివృద్ధి పనులను పూర్తిచేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, హమీద్‌పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డి, సింధు ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, అధికారులు ఎస్‌వి. శంకర్‌నాయక్, ఈఈ శ్రీనివాస్ ,శ్రీకాంతిని, డీఈ రమేష్, దుర్గాప్రసాద్, శిరీష, విశాలాక్షి, ఏఈలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల పునర్నిర్మాణంలో సమస్యలు తలెత్తకుండా చూస్తా



శ్రీవీర అభయాంజనేయస్వామి ఆలయంలో వేసిన బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: శ్రీవీర అభయాంజనేయ స్వామి ఆలయాన్ని శోభయామానంగా నిర్మించి భక్తుల సందర్శనార్థం ఆలయాన్ని త్వరితగతిన అందుబాటులోకి తేవాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆలయ కమిటీ నిర్వాహకులను కోరారు. శుక్రవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్యనగర్‌లోని శ్రీ వీర అభయాంజనేయ స్వామి ఆలయ పునర్ నిర్మాణ పనుల్లో భాగంగా ఆలయంలో వేసిన బోర్‌వెల్‌ను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆలయాల పునర్ నిర్మాణంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని కార్పొరేటర్ సూచించారు. ఆలయాల పునర్నిర్మాణంలో సమస్యలు తలెత్తకుండా చూస్తానన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం నర్సింగ్‌రావు, బుర్రి యాదగిరి, ఆలయ కమిటీ సభ్యులు మక్కాల సత్యనారాయణ, కనకరాజు యాదవ్, బల్‌రాజు, నాగేష్, మల్లేష్, కృష్ణరెడ్డి, రాములు, మక్కాల నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఆపరేషన్ స్మైల్'

- సైబరాబాద్‌లో పరిధిలో 11 ప్రత్యేక టీమ్‌ల పర్యవేక్షణ
- స్పెషల్ డ్రైవ్‌లో జనవరిలో 718 మంది పిల్లలు గుర్తింపు

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నిర్వహిస్తున్న ఆపరేషన్ స్మైల్‌కు మంచి స్పందన వస్తోంది. బాలకార్మికులు, భిక్షాటన, తదితర పనులను చేస్తున్న పిల్లలు, పారిపోయిన వీధి పిల్లలు, బలహీనమైన పిల్లలను రక్షించేందుకు సైబరాబాద్ పోలీసులు 11 ప్రత్యేక ఆపరేషన్ స్మైల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఏడాది పొడవునా పనిచేస్తూ ఎప్పటికప్పుడు రక్షించిన పిల్లలను షెల్టర్ హోమ్‌లకు తరలిస్తున్నారు. అందులో భాగంగా జనవరిలో 718 మంది పిల్లలను రక్షించారు. అందులో మనరాష్ట్రానికి చెందిన వారిలో 301 మంది బాలురు, 28 మంది బాలికలుండగా ఇతర రాష్ట్రాలకు చెందిన 360 మంది బాలురు, 29 మంది బాలికలు ఉన్నారు. కాగా బాలకార్మికుల నిర్మూలన, ఇతర అంశాలపై ఫోన్ నెంబర్లు 9490617444, లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సైబరాబాద్ కమిషనరేట్ విమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ స్పష్టం చేశారు. అనంతరం స్మైల్ టీమ్‌ల పనితీరుపై ఆమె సమీక్షించారు.



సైబరాబాద్ కమిషనరేట్‌లో మాట్లాడుతున్న డీసీపీ సృజన